అపార్థం చేసుకోకపోతే—మూర్ఖం.

వ్యాసం పోయినకొద్దీ దిగజారిపోతూ అసలు రంగుతో ఏ తాలూకా కమ్యూనిస్టు ప్రముఖుల మీదో నిప్పులు చెరిగింది. క్రమంగా "మూడో కాలం" అందుకుని ఈ క్రింది వాక్యందగ్గర "క్లైమాక్సు" కొచ్చింది. "మానవ స్వభావ లోతులు తరచిచూసి, జీవితం అంతు కనుక్కున్న భారతీయులు చెప్పినదాంట్లో సత్యం కానిదికూడా ఉంటుందా?" అసలు ఉపేంద్రరావుగారు ఇంత శ్రమతీసుకుని ఈ వ్యాసం రాయకుండా ఏ భగవద్గీత శ్లోకమో తీసుకుని ప్రతి పదార్థం దండాన్వయం ఇస్తే సరిపోయేది. "ఆనందము" అనే వస్తువు వ్యక్తికి ఎక్కడ ఏ రూపంలో లభ్యమవుతుందో కూడా చివరికి ఆ కర్మవాదము చెప్పాల్సివచ్చింది. మంగళం పాడుతున్నట్టుగా ఒక సంస్కృత శ్లోకాన్ని ఉదహరిస్తూ చివరికీ పదజాలంతో రచయిత వ్యాస్యాన్ని ఆపారు: "భారత వర్షంలో జన్మించి, భారతీయ పవిత్ర ధర్మాన్ని అర్థం చేసుకోలేకపోవటమే కాక, అపహాస్యం చేయటంకంటే దౌర్భాగ్యమున్నదా?" "దౌర్భాగ్యము" అనే పదం బదులు "ఘోరపాతకం" అన్న పదం వాతావరణానికి మరింత అనుకూలంగా వుండేదేమో!

నా వ్యాసం ముగిస్తూ, పాఠకులకీ, ఉపేంద్రరావుగారికీ చిన్న మనవిచేస్తున్నాను. శత్రువుతో చేరిపోయి దేశద్రోహం తలపెట్టిన రాజపుత్రులూ జయసింహులూ మనకున్నారు. రాజవంశంలో కీచులాటలకి జననాశం జరిగినగాథ మన మహాభారతం. ఒక వ్యక్తి తనభార్యకోసం, సైన్య, భక్త సమూహాల్ని వెచ్చించిన గాథ మన రామాయణం. పోతే పాశ్చాత్యులకీ జోన్ ఆఫ్ ఆర్కులూ, అబ్రహాంలింకన్లూ వున్నారు. వాళ్లకీ స్వాతంత్రోద్యమాలూ, రాజ్యప్రదానాలూ వున్నాయి. అదికాదు ముఖ్యం. "భారతవర్షం" "మన ప్రాచీన భారతీయ సంస్కృతి," "పవిత్ర ఆదర్శాలు" ఇలాంటి పదాల జంఝాటంలోనూ, సెంటిమెంట్ల ప్రభావంలోనూ కొట్టుకుపోయి మన చుట్టూ గూడు కట్టుకోవటంవల్ల ప్రయోజనం లేదు. "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి"అన్న వాక్యం ఎన్ని తరాలుపోయినా, ఎన్ని యుగాలు గడిచినా మనకు హేయమైనదే. మనవాళ్ళని నిరసించటం గాని, పాశ్చాత్యుల్ని వెనకేసుకు రావటంగాని నా యీ విమర్శ ప్రధానోద్దేశ్యం కాదు. కళ్లు విప్పి, ఉన్నది ఉన్నట్టు చూసి, విషయపరిశీలన చెయ్యటం అవసరం. స్వయంగా ఆలోచించగల్గిన సత్తాగలవాళ్ళు ముందు యేర్పరచుకొన్న అభిప్రాయాలతోనూ, సెంటిమెంట్లతోనూ బయలుదేరక నిశితంగా చూసి దారితియ్యటం ప్రస్తుత పరిస్థితుల్లో మనజాతి కెంతైనా అవుసరం.

—సి. ధర్మారావు

---

కథానిక

# అరుణభాస్కరం

తెలికిచర్ల ప్రభ

“ఇవాళ శనివారం. మామూలుగానే, ప్రతి శనివారం సాయంత్రంలాగే ఇవాళకూడా క్లబ్బులో మేమంతా కలుసుకుని కబుర్లు చెప్పుకుంటాం" అనుకున్నాను, ఆరోజు పొద్దున్న కోర్టుకు వెళుతూ. 'మేము' అంటే ఆరుగురం. నేను రామారావు, సత్యనారాయణ, చందర్, భాస్కర్ మేము చిన్నప్పటినుండీ స్నేహితులం. లాయర్లు మనిపించుకున్నాం. కాని మాలో ఎవరూ ప్రాక్టీసు చెయ్యడంలేదు. నేనూ రామారావు సత్యనారాయణ మాత్రం అప్పుడప్పుడు ఏవో కొన్ని కేసులనుగురించి కోర్టుకు నల్లకోటేసుకుని బయలుదేరుతుంటాం. చందర్ వాళ్ళ నాన్న వ్యాపారంలోకి దిగాడు. భాస్కర్ తండ్రి జడ్జీగాఉండి బోలెడంత ధనంకూడ బెట్టి పోయాడు. తల్లి చిన్నప్పుడే పోయింది. ఒక్కడే కొడుకవడం మూలాన్న తండ్రి పెట్టిపోయిన డబ్బంతా ఖర్చు చెయ్యడమే భాస్కర్ పని. డబ్బుండి పని చెయ్యవలసిన అవసరంలేని యువకులెల్లాఉంటారు? అలాగే ఉండేవాడు భాస్కర్. అసలు సంగతి... మేము లాకాలేజీలోంచి బయట

పడగానే ఒక నిర్ధారణ చేసుకున్నాం— ప్రతి శనివారం క్లబ్బులో కలుసుకోవాలని. ఇంతవరకూ, అంటే ఈ అయిదేళ్ళగా ఒక్కట్నా తప్పలేదు.

ఆరోజు సాయంత్రం మామూలుగానే సమావేశమయ్యాం మేము—భాస్కర్ తప్ప.

ఎప్పుడూ ఆరున్నరకల్లావచ్చేసేవాడు ఆరోజు ఎనిమిదిఅయినా రాలేదు. పేకాట మంచి రక్తిలో ఉంది. భాస్కర్‌కి పేకాటంటే తగని వెర్రి. వాడితో పందెంవేస్తే ఎవరైనా ఓడిపోవాల్సిందే. (రహస్యంగా మీతోమాత్రంచెప్తున్నాను, నేనింత వరకు భాస్కర్‌కి కొన్ని వందల రూపాయలు ఓడాను.) భాస్కర్ రాకపోవడం మాకందరికీ చాలా ఆశ్చర్యం కలిగించింది. అసలు భాస్కర్ ప్రవర్తనేకొన్నాళ్ళగామాకందరికీవింతగాతోచింది.

తొమ్మిదిగంటలకి మేమంతా మామా యిళ్ళు చేరుకున్నాం. నాకుమాత్రం రాత్రి నిద్దరపట్టలేదు. భాస్కర్ ఎందుకు రాలేదా? అని ఆలోచిస్తున్నాను. "ఏదో పనుండి రాలేకపోయాడేమో"నని మనస్సు సముదాయించుకున్నా బుర్ర యింకా వేడెక్కిపోతోంది. ఏదో ఆందోళన బయలుదేరింది. గుండె బరువెక్కింది. భాస్కర్‌కేదో కీడుమూడిందని అంతరాత్మ చెప్తున్నట్టు తోచింది.

మదరాసులో అందరికంటె గొప్ప గుండె డాక్టరెవరా అంటే "వెంకటేశ్వర్రావు"అని ఎవరన్నా చెప్తారు. ఆయన వయస్సులో చిన్నైనా వృత్తిలో చాలా పేరుపొందారు. అతనిభార్య అరుణ అందకత్తె. చదువంతగా లేకపోయినా చాలా నాజూగ్గా ఆకర్షణీయంగా దుస్తులువేసుకుంటుంది. పార్టీలన్నా సినిమాలన్నా చాలా యిష్టం. భర్త హోదావల్ల, తన అందంవల్ల తనొక పెద్ద సొసైటీ లేడీగా చెలామణీ అవాలనే అభిలాష. వెంకటేశ్వర్రావు గొప్పడాక్టరే అయినా, ధనం విషయంలో అంతగొప్పవాడుకాడు. పెద్ద భవనం, నవీన విధానంలో నిర్మించబడ్డ తన కన్సల్టింగ్‌గది, కొత్త కొత్త మందులు, విదేశీయ యంత్రాలు పరికరాలు ఇవన్నీ అతని ఆదాయాన్ని మింగేసేవి. పైగా అతను ఒక దివాలా తీసిన బ్యాంకులో కొంతడబ్బు నష్టపోయాడు. దీనికితోడు అతనిస్వభావం. అందరు పేషంట్ల దగ్గరా డబ్బుగుంజడం చాతకాదతనికి. ఏదయితేనేమి అరుణ వేషాలకి కావలసినంత డబ్బులీయన ఇవ్వలేకపోయేవాడు.

ధనవంతుడూ, విలాసపురుషుడూ అయిన భాస్కర్‌కి అరుణతో పరిచయమయింది. భాస్కరామెను ప్రేమించాడు. ఆమె అతని ధనాన్ని ప్రేమించింది. వెంకటేశ్వరరావు అరుణకోసం పది రూపాయలు ఖర్చుచెయ్యడానికి వెనక తీసేచోట భాస్కర్ వెయ్యిరూపాయలు పొయ్యడానికి సిద్ధపడేవాడు. భాస్కర్‌కి ముందుకొంచెం భయంగా ఉండేది.తీరా వీళ్లవ్యవహారంచూసి అరుణకుడాక్టరు విడాకులిచ్చేస్తాడేమోనని. అప్పుడు భాస్కరే అరుణను చేరదీయాల్సొస్తుంది. అది అసంభవం! కాని డాక్టరు వీళ్ళ వ్యవహారం ముదుర్తున్నా కూడా చూసీ చూడనట్టుండేవాడు. దాంతో భాస్కర్ డాక్టరంటే చులకనగా చూసేవాడు.

వెంకటేశ్వరరావు స్వతహాగా చాలా మంచివాడు, శాంతస్వభావుడు, అమాయకుడు. అరుణ భాస్కర్ల స్నేహం మొదట్లోనే గమనించి, దాని పర్యవసానాన్ని గుర్తించినా కూడా భాస్కర్‌ని వారించలేకపోయాడు. అతను తన పెద్దభవనంలో కూర్చుని పేషెంట్ తర్వాతపేషెంట్‌ని ఓపికగా పరీక్షచేస్తూంటే భాస్కర్ కారులోవచ్చిఅరుణను ఏ సినిమాకో, పార్టీకో తీసుకెళ్లడం పరిపాటయిపోయింది. అరుణ భాస్కరిచ్చిన చీరెలు, నగలు సింగారించుకుని భాస్కర్‌తో వెళ్ళిపోవడము చూసి కూడా డాక్టరేమీ చెయ్యలేకపోయేవాడు. కాని లోపల లోపల కుమిలి ఏడ్చేవాడు. దీనితో భాస్కర్‌కి డాక్టరంటే తిరస్కారభావం ఎక్కువయింది. ఏవిధంగానైనా డాక్టర్ మనస్సింకా కష్టపెట్టాలనాలోచించాడు.

నవీన యువకుల్లో (అదీ ధనికవర్గానికి చేరినవారిలో) సాధారణంగా ఏదో ఒకజబ్బుతో బాధపడుతున్నా మనుకోడం ఫ్యాషన్ అయింది. భాస్కర్ కొన్నాళ్ళగా అప్పుడప్పుడు గుండె నొప్పిగా ఉందనేవాడు. అది ఉత్తిఅజీర్ణమే అవచ్చు. కాని డాక్టర్ని కష్టపెట్టడానికి మంచి అవకాశం కనపడింది భాస్కర్‌కి. భాస్కర్‌కి డాక్టరుకి తనంటే రోత అని తెలుసు. అందుకే తన శరీరాన్ని పరీక్ష చెయ్యడాని కిష్టం లేకపోయినా తనిచ్చే పెద్ద ఫీజుకోసం ఆశపడి డాక్టరు తనను పరీక్ష చేస్తాడనీ, పరీక్ష చేస్తున్నంతసేపూ డాక్టర్ పడే మనోవ్యధను చూసి నవ్వవచ్చనీ, పరీక్షయాక,

డాక్టర్ మోహన్న కొన్ని నోట్లు చులకనగా విసర వచ్చనీ అనుకుని భాస్కర్ వెంకటేశ్వరరావుని గుండె పరీక్ష చెయ్యమన్నాడు. వెంకటేశ్వరరావు ముందుతటపటాయించినా చివరకుఒప్పుకున్నాడు.

భాస్కర్ హుషారుగా కన్సల్టింగ్ గదిలో ప్రవేశించాడు. చొక్కా తీసేస్తూ చాలా తేలిగ్గా తిరస్కార భావం ఉట్టిపడేటట్టుగా అన్నాడు: "జబ్బేమీ లేదుగాని, నువ్వోమాటు చూసి అభయ మిస్తావని" డాక్టర్ ముఖంలో ఏ భావమూ స్ఫురించలేదు. రాతితో మలచినట్టున్న ముఖంలో చలనం కలగలేదు.

ఓపిగ్గా, నెమ్మదిగా, భాస్కర్‌ని పరీక్షచేశాడు కాని అంతసేపూ డాక్టర్ ముఖంలో ప్రతిక్షణం గాంభీర్యంఎక్కువవడంచూస్తే భాస్కర్‌కి భయం వేసింది. ఈ భయమెందుకో తనకే అర్థంకాలేదు. పరీక్షించడం అయిపోగానే భాస్కర్ భయా న్నంతా దిగమింగి లేని హుషారు తెచ్చుకుని చులకనగా "ఏం ఏమంటావు?" అన్నాడు.

డాక్టర్ ముఖం గంభీరంగా ఉంది. "సారీ భాస్కర్. నీది చాలా సీరియస్ కేసు. నీ గుండె జబ్బు చాలా ముదిరిపోయింది. నువ్వేక్షణమేనా చచ్చిపోవచ్చు. మహా ఉంటే నీకింకా ఆర్నెల్లుందేమోఆయుర్దాయం.అదీ నేననుకుంటున్నా. నువ్వింకో డాక్టర్ని చూడ్డం మంచిది. కాని అతనుకూడా యిదే చెప్తాడు" అని యింకా ఏవో మెడికల్ పదాలేవో కొన్ని వల్లించాడు జబ్బేమిటో చెప్తూ;

భాస్కరెల్లా బయటపడ్డాడో అతనికే తెలిదు. యింకోడాక్టర్ని చూడలేదు. ఎందుకూ మళ్ళీ నా చావు విషయం చెప్పించుకోడానికా? పైగా వెంకటేశ్వరావుకన్నా మంచిడాక్టర్ లేడుగా? అనుకున్నాడు. ఈ బ్రతికే కొన్నాళ్ళైనా జల్సాగా ఉందాం. వీలయినంత ఆనందిద్దాం అనుకున్నాడు. భాస్కర్ కాని ఎందులోనూ ఆనందం తృప్తి పొందలేక పోయాడు. అరుణను చూడ్డమే మానేశాడు. అరుణను తల్చుకుంటేనే ఆసుపత్రిలో అరుణ భర్త పల్కిన క్రూర వాక్యాలు జ్ఞాపకమొచ్చేవి.

ఒకరోజున టెన్నిస్ ఆడుతూ భాస్కర్ మంచి నేర్పుచూపించాడు. అదిచూసి ప్రక్కనే వున్న స్నేహితుడు "ఒరేయి నువ్వు రోజురోజుకీ బాగా ఆడుతున్నావురా. ఇంకో ఆర్నెల్లికి ఛాంపియన్ అయి కూర్చుంటావు" అన్నాడు. వెంటనే భాస్కర్ రాకెట్ ఎగరేసి వెళ్ళిపోయాడు "ఇంకో ఆర్నెల్లికి!! చచ్చి స్వర్గాన వుంటాను. చచ్చేముందు ఛాంపియన్ అయితేనేం! కాకపోతేనేం?" అనుకుంటూ. ఇంకోరోజున క్లబ్బులో మాతో పేకాడుతూ కొన్నివందలు గెలిచాడు. నేనన్నా "ఈవిధంగా అయితే యింకో మూణ్ణెల్లల్లో నువ్వోక కోటీశ్వరుడి వవుతావురా!" భాస్కర్ ప్రవర్తన మా కర్థంకాలేదు. నేనూ అలా అనగానే అతను పేక దస్తా విసిరేసి రివ్వున వెళ్ళిపోయాడు. "మూణ్ణెల్లల్లో చచ్చేవాడిని నేను కోటీశ్వర్ణైతేనేమి? బిచ్చగాణ్ణయితేనేం?" అనుకుంటూ.

భాస్కర్ తనగదిలో కూర్చున్నాడు. చింపిరి తల, మాసినగడ్డం, నిద్రలేని ఎర్రనికళ్లు, ముందు బల్లమీద సీసాలు గ్లాసులూ. అకస్మాత్తుగా టెలిఫోను మోగింది. విసుగ్గా తీశాడు. "నేను భాస్కర్, అరుణని. నిన్నుచూసి చాలారోజులయింది. నువ్విప్పుడు వెంటనే మాయింటికి రావాలి....ప్లీస్!"... ఆమెకంఠంలో ఆందోళన, ఆదుర్దా, భయం స్ఫురించాయి.

"ఏం ఏమయింది?" అన్నాడు భాస్కర్ కోపంగా.

"అలా కోపగించుకుని కసరకు భాస్కర్, నీవే నాకు సాయంచెయ్యాలి. డాక్టర్ చనిపోయారు. కారు ఏక్సిడెంటయింది. భాస్కర్ చనిపోయేముందతను నిన్ను, నన్ను గురించే పలవరించారు, పెద్దగా నవ్వి..."అజీర్ణంవల్ల గుండె నొప్పి, తెలివితక్కువ దద్దమ్మ నేను చెప్పింది నమ్మాడు, శుద్ధచవట-ఇంకో డాక్టర్ దగ్గరకెళ్ళే లోగా కాస్త మనోవ్యధ కల్గిద్దామని అనుకుంటే భలే బాగా జరిగింది. గాడిదకి తగినశాస్తయింది. హా హా" అని మళ్ళీ వికటాట్టహాసంచేసి చచ్చిపోయారు. భాస్కర్! నాకేమీ అర్థంకాడం లేదు. దయచేసి వేగంరావూ? నాకుచాలా భయంగాఉంది భాస్కర్" ఆమె ఎంతో ప్రాధేయపడుతూంది.

"రాను. నేను రానుగాక రాను"అని భాస్కర్ అరిచి రిసీవర్ క్రిందపడేసి వెర్రిగా కేకవేసి క్రింద పడిపోయాడు.

భాస్కర్ ఇక శనివారాలు క్లబ్బుకి రాలేదు.